
# టిప్ ఫర్ టాక్స్

డాక్టర్.డి.ఎ.సత్యనారాయణ



"యస్... పేషంట్‌ను పంపించండి"... సిస్టర్‌తో చెప్పాడు డా.అహోబలరావు. ఆయన పట్టణం లోని 'ప్రముఖ దంతవైద్యుడు'.

సన్నటి పొడుగాటి వ్యక్తి హుందాగా లోపలికి అడుగు పెట్టాడు. అతడి చేతిలో బ్రీఫ్ కేస్ ఉంది. 'వాటీజ్ ది ప్రాబ్లెం?'

"అయామ్ పశుపతి... ఇన్‌కంటాక్స్ ఇన్‌స్పెక్టర్ ఫ్రం కాకినాడ..." అంటూ ఆ వ్యక్తి డాక్టర్ గారి వైపు చెయ్యి చాచాడు.

డాక్టర్ అహోబలరావుకు చెమటలు పట్టాయి. షేక్ హ్యాండ్ ఇస్తున్న డాక్టర్ చెయ్యి వణకడం గమనించాడు ఐ.టి.ఇన్‌స్పెక్టర్ పశుపతి.

"చూడండి మిస్టర్ అహోబలరావుగారు... మీరు పేషంట్ల వద్ద విపరీతంగా డబ్బులు గుంజుతున్నారని... కాని ఐ.టి.రిటర్న్స్‌లో చాలా తక్కువగా ఫీజు చూపు తున్నారని మాకు కంప్లైంట్స్ వచ్చాయి. అందువల్ల నేనే స్వయంగా ఎంక్వయిరీకి వచ్చాను... డాక్టర్‌గారి కళ్ళ లోకి గుచ్చి గుచ్చి చూస్తూ చెప్పాడు పశుపతి.

"నో... నో... అలాంటిది ఏమీ లేదు... కావా లంటే మీరు ఈ 'రోజంతా క్లినిక్‌లో కూర్చుని నా ఫీజు అసెస్ చెయ్యండి...' అపుకుందామన్నా ఆగడంలేదు ఆయన గొంతులో వణుకు.

"ఓ.కె. ఐ విల్ పర్సనల్లీ అసెస్......" హుందాగా పలికాడు పశుపతి.

"ఏం తీసుకుంటారు? కాఫీ... ఆర్ కూల్ డ్రింక్..." కాస్త ఉత్సాహం వచ్చింది డాక్టర్ గారిలో!

"సిస్టర్ రెండు మజా పంపించు..." కేకవేశాడు డాక్టర్ అహోబలరావు. పశుపతి చిన్నగా నవ్వుకున్నాడు. కూల్ డ్రింక్ పూర్తి అయిన తరువాత పేషంట్స్‌ను పంపమని నర్స్‌కు ఇన్‌స్ట్రక్షన్ ఇచ్చాడు.

నడివయస్సు స్త్రీ లోపలికి వచ్చింది. ఆమె చేతిలో "ఎక్స్‌రే ఫిల్మ్" ఉంది. దానిని తీసుకున్నాడు అహోబలరావు. పశుపతి నిశ్శబ్దంగా డాక్టర్‌ను పరిశీలించ సాగాడు.

"చూడండి పశుపతిగారు, ఇది డెంటల్ ఎక్స్‌రే... ఈమెకు "జ్ఞాన దంతం" ఎముకలోనే ఉండిపోయింది. దీనిని "థర్డ్ మోలార్ ఇంపాక్షన్" అంటారు. ఈ పంటి చుట్టూ చీము చేరి తరుచూ వాపు, నొప్పి వస్తూ ఉంటుంది. నోరు కూడా తెరవడానికి వీలుండదు. ఈమెకు ఇప్పుడు ఆపరేషన్ చేసి... అంటే... కాస్త చిగురు ఎముక కోసి... పంటిని తొలగిస్తానన్న మాట... ఒక గంట పడుతుంది... డోంట్ ఫీల్ బోర్... అవుకుండా కూర్చుంటారుగా..." అభ్యర్థిస్తున్నట్లు అడిగాడు డా. అహోబలరావ్.

"ఓ.కె. ప్రొసీడ్..." తల ఊపాడు పశుపతి. గంట తరువాత తీసిన పంటి స్థానంలో కుట్లు వేసి, వాష్ బేసిన్‌లో చెయ్యికడుక్కొని, తన రివాల్వింగ్ చెయిర్‌లో కూర్చున్నాడు డా. అహోబలరావు, చీటీ మీద మందులు వ్రాసి వాడే విధానం చెప్పాడు ఆమెకు.

"ముందు చెప్పినట్లుగా ఫీజు ఇరవై రూపాయలు ఇవ్వండి..." కాస్త గట్టిగా అడిగాడు పేషంటును. ఆమె ఆశ్చర్యంగా నోరు తెరిచి ఏదో చెప్పబోయింది. మాట్లాడ వద్దన్నట్లు ఆమెకు రహస్యంగా సైగ చేసాడు అహోబలరావ్! అది గమనించాడు పశుపతి, తనలో తాను నవ్వుకున్నాడు. ఆమె పర్సు తెరిచి ఇరవై రూపాయల నోటు అందించి బయటికి వెళ్ళింది.

"చూశారా పశుపతిగారు! ఇంతసేపు పట్టిన ఆప రేషన్‌కు కూడా నేను కేవలం ఇరవై రూపాయలే డిమాండ్ చేసాను. ఇక మామూలు ఎక్స్‌ట్రాక్షన్‌కు ఐదు రూపాయలు కేవలం... ఫైవ్ రుపీస్ మాత్రమే ఛార్జీ చేస్తాను..." ఈసారి కాస్త ధైర్యంగా పలికింది డాక్టర్ గారి గొంతు. మౌనంగా విన్నాడు పశుపతి.

"సిస్టర్... రెండు కాఫీ పంపించు..." కేక వేశాడు డాక్టర్... "నో... మీకు ఎవరో నా మీద కావాలనే కంప్లైంట్ ఇచ్చి ఉంటారు...". రెండు వేడి వేడి కాఫీ లోపలికి వచ్చాయి. నిశ్శబ్దంగా త్రాగాడు పశుపతి.

బ్రీఫ్ కేస్ అందుకొని కుర్చీలో నుండి లేచాడు పశుపతి. ప్రశ్నార్థకంగా చూచాడు డాక్టర్.

"థాంక్యూ డాక్టర్... థాంక్యూ... ఎట్ ది సేమ్ టైం మై సిన్సియర్ రిగ్రెట్ ఆల్సో... నిజంగా నేను ఐ.టి.ఇన్‌స్పెక్టర్‌ను కాను... ఇంతకు మునుపు మీరు ఆపరేషన్ చేసింది స్వయంగా మా అక్కయ్యకే! మొన్న కన్సల్టేషన్ కోసం వచ్చినప్పుడు ఆపరేషన్ కోసం మూడు వందలు డిమాండ్ చేసారటగా... అందుకే చిన్న ట్రిక్ ప్లే చేసాను..." నెమ్మదిగా నడుచు కుంటూ అతడు గది బయటికి వెళ్ళి పోయాడు. అవాక్కయి అలానే చూస్తూ కూర్చుండిపోయాడు డాక్టర్ అహోబలరావు.